క్లుప్తంగా

254 మందికి వైద్య పరీక్షలు



కడియంలో పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కడియం: ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కడియం సచివాలయం–3 పరిధిలో డాక్టర్ ఎస్.నాగసాయిమౌర్య ఆధ్వర్యంలో మంగళవారం 254 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఒకరిని ఆరోగ్యశ్రీ వైద్య సేవలకు రిఫర్ చేశారు. రోగులకు వైద్యులు జి.శ్రీనివాస్, అనసూరి ప్రియాంక, ముస్తాఫాఖాన్ సేవలు అందించారు. వైద్య సిబ్బంది, సచివాలయ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య శాఖ అంతర్గత కమిటీ సభ్యుడిగా 'గొట్టిముక్కల'



గొట్టిముక్కల అనంతరావు

రాజమహేంద్రవరం సిటీ: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013 అమలుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అంతర్గత కమిటీలో సభ్యుడిగా న్యాయవాది, జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావును నియమించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ సనత్ కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అనంతరావు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులను లైంగిక వేధింపులకు గురిచేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఫిర్యాదు వస్తే కమిటీలో చర్చించి చట్టపరంగా తగిన చర్యలు చేపడతామన్నారు. మహిళల రక్షణకు నిరంతరం కృషి చేస్తానన్నారు. మూడేళ్లపాటు ఈ కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తానన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న మల్‌బార్ సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ: మల్‌బార్ ఆధ్వర్యంలో ఆకలి రహిత ప్రపంచ సాధనకు కృషి చేస్తున్నట్టు ఆ సంస్థ సిబ్బంది తెలిపారు. మల్‌బార్ గ్రూప్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం పేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. నిర్వాహకుడు ఎంపీ అహ్మద్ మాట్లాడుతూ సాంఘిక సేవా కార్యక్రమాల్లో అత్యంత గుర్తింపు పొందిన ఎన్జీఓ ధనల్ దయా రిహాబిలిటేషన్ ట్రస్ట్ సహాయంతో హంగర్ ఫ్రీ వరల్డ్ ప్రోగ్రాం అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ఎన్టీఆర్‌కు నివాళి

సీటీఆర్ఐ: స్థానిక తిలక్ రోడ్డులోని టీడీపీ ఎన్నికల కార్యాలయం వద్ద ఆ పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ఎన్టీఆర్ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: ఎన్టీఆర్ జయంతి వేడుకలను రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి ఆదేశాల మేరకు ఆయన నివాసంలో నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, పార్టీ నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

ఆ దారిలో భయం భయం

- తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో సమస్యలు
- వీధిదీపాలు వెలగక అవస్థలు
- తీరని మురుగునీటి తిప్పలు



నిర్మితి కేంద్రం వద్ద నిల్వ ఉన్న మురుగునీరు



రూరల్ తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో ప్రమాదకరంగా గోతులు

రాజమహేంద్రవరం రూరల్: రాత్రయితే అంధకారం.. రోడ్డంతా మురుగుమయం.. దీనికితోడు ఎక్కడికక్కడే గుంతలు.. ధవళేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలోని రూరల్ తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో సమస్యలు ఇవీ. ఒకపక్క వీధిదీపాలు వెలగకపోవడం, మరోపక్క డ్రైనేజీ నిర్మాణం చేపట్టినప్పటికీ మురుగునీరు నిర్మిత కేంద్రం మీదుగా వెళ్లడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీనివల్ల వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఈ రూరల్ తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో తహసీల్దార్ కార్యాలయంతో పాటు, వైటీసీలో సుమారు 12 ప్రభుత్వ జిల్లా శాఖల కార్యాలయాలు ఉన్నాయి. ప్రతి రోజూ ఉద్యోగులు విధులు ముగించుకుని, అలాగే ప్రజలు రాత్రి సమయాల్లోనే ఇంటికి వెళుతుంటాయి. ఆ రోడ్డులో గతంలో వీధిదీపాలు వేసినప్పటికీ మందుబాబులు పుణ్యమా అని వాటిని పగలగొట్టేశారు. తిరిగి కొత్తగా వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం రాత్రయితే అంధకారం అలముకుంటోంది. ఏ విష కీటకం కాటేస్తుందోనని ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం సైన్స్ సెంటర్ ఆవరణలో ఉన్న విద్యుత్ దీపాల వెలుగు కాస్తా రోడ్డుపై పడడంతో ఊరటనిస్తున్నా, ఇబ్బంది మాత్రం కొనసాగుతోంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధిదీపాలు వేయించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

గోతులు.. తిప్పలు

బొమ్మూరు మహిళా ప్రాంగణం నుంచి సైన్స్ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం నుంచి రూ.1.20 కోట్లతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. అయితే డ్రైనేజీ నిర్మాణం కోసం తీసిన గోతులు సరిగా పూడ్చకపోవడంతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే మలుపులో ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయాల్లో ఎవరైనా ఈ గోతుల్లో పడితే భారీ ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. ఈ గోతులను వెంటనే పూడ్పించే ఏర్పాట్లు చేయాలి.

ముంచేస్తున్న మురుగు

ఈ డ్రైనేజీ నిర్మాణం పూర్తయినా నిర్మితి కేంద్రం వద్ద మురుగునీరు వెళ్లేందుకు అవుట్‌లెట్ ఏర్పాటు చేయలేదు. పై నుంచి వచ్చే మురుగు నీరు నిర్మిత కేంద్రం వద్ద నిల్వ ఉంటుంది. అక్కడంతా దుర్గంధం వెదజల్లుతుంది. దీనివల్ల నిర్మితి కేంద్రానికి తాళాలు వెయ్యాల్సిన పరిస్థితి ఏర్పడింది. వెనుక ఉన్న వైఎస్సార్ కాలనీలో వాంబే గృహాల నుంచి వచ్చే మురుగునీరు ఇక్కడకు చేరుతుంది. ఇప్పటికైనా నిర్మించిన డ్రైన్‌కు అవుట్ లెట్ ఏర్పాటు చేస్తే ముంపు సమస్య తప్పుతుంది. అధికారులు ఆ దిశగా కార్యాచరణ చేయాలి.

సేవల్లో అలసత్వం వద్దు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజ్‌మనోజ్

కడియం: ప్రజలకు అందించే సేవల విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పెన్షన్ల పంపిణీ ఏర్పాట్లపై ఆరా తీశారు. అలాగే పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్‌ను అనుసరించి పనులు చేయాలన్నారు. విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్ల జారీలో ఎటువంటి ఆలస్యం లేకుండా చూసుకోవాలన్నారు. రికార్డుల నిర్వహణ, సచివాలయ సిబ్బంది హాజరు తదితర అంశాలపై సమీక్షించారు. వివిధ గ్రామాల కార్యదర్శులు హాజరయ్యారు.

కాలువల్లో పూడిక వెంటనే తొలగించండి



ట్రైనీ కలెక్టర్ భావనతో కలసి పనులు పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని మేజర్, మైనర్ డ్రెయిన్లలో పూడికను వెంటనే తొలగించి, ముంపు సమస్య రాకుండా చూడాలని కమిషనర్ కె.దినేష్‌కుమార్ శానిటరీ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలో పారిశుధ్య నిర్వహణ, పూడికతీత పనులను ట్రైనీ కలెక్టర్ భావనతో కలసి పరిశీలించారు. జడ్జి బంగ్లా వాటర్ ట్యాంకుల వద్ద ఉన్న 25వ క్లస్టర్ మస్టర్ ఆఫీస్‌లో మస్టర్ నిర్వహణ, పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలించారు. వెహికల్ యార్డుకు వెళ్లి పారిశుధ్య వాహనాల రికార్డులు తనిఖీ చేశారు. గార్బేజ్ ట్రాన్స్ఫర్ పాయింట్ (సెకండరీ)ను పరిశీలించి తడి, పొడి, హానికర చెత్త వేర్వేరుగా తరలించే విధానాన్ని పరిశీలించారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో జూన్ మొదటి వారం నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈ నెల 31వ తారీకులోగా అన్నీ డ్రెయిన్లలో పూడిక తొలగించి మురుగునీటి పారుదలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖాధికారి ఎ.వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు .

నేడు జ్యోతిర్మయి రాక

ధవళేశ్వరం: స్థానిక జనార్దనస్వామి ఆలయాన్ని వాగ్గేయకారిణి అమ్మ కొండవీటి జ్యోతిర్మయి బుధవారం సాయంత్రం దర్శించుకోనున్నారని జనార్దన సేవకులు తెలిపారు. అలాగే శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వర స్వామిని, అనంతరం ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటారని అన్నారు. భక్తులు, జనార్దన, శివ సేవకులు తరలిరావాలని కోరారు.

మట్టి లారీ సీజ్



పెదపూడిలో అధికారులు పట్టుకున్న మట్టి లారీ

పెదపూడి: పెదపూడి గ్రామంలో నిబంధనలు ఉల్లంఘించి, అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీని పట్టుకుని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ త్రివేణి తెలిపారు. పెదపూడి మాచరమ్మ తల్లి ఆలయం సమీపంలో మంగళవారం ఎలాంటి అనుమతులు లేకుండా లారీపై అక్రమంగా మట్టి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అలాగే మట్టి తవ్వకాలకు సంబంధించి అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇదిలాఉంటే లారీ ద్వారా సమీపంలోని పంట కాలువకు అడ్డుకట్ట వేసి దానిపై మట్టి తరలించడంతో పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కృష్ణునిపాలెంలో..

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని రాతి చెరువులో మట్టి అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.నాగరాజు తెలిపారు. చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఇరిగేషన్ ఏఈ వై.శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేశామన్నారు. రెండు ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మెదడుకు మేత మంచి పుస్తకం



కడియం గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరిస్తున్న చిలుకూరి శ్రీనివాసరావు

కడియం: మెదడుకు మేత మంచి పుస్తకమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. కడియం శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎస్.శ్రీదేవి ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో మంగళవారం చిలుకూరి పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయానికి పలు పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలకు నీతి కథలు చెప్పారు. ఈ గ్రంథాలయంలో ఏటా వేసవి విజ్ఞానం పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారిని శ్రీచెళ్లపిళ్ల వెంకటశాస్త్రి కళా సేవా సమితి అధ్యక్షుడు అడపా సుబ్రహ్మణ్యం ప్రశంసించారు. నేటితరం పిల్లలను గ్రంథాలయాల వైపు మళ్లించే వేసవి విజ్ఞాన శిబిరాలు మహోన్నతమైనవని యూటీఎఫ్ నాయకుడు ఆకుల వీర్రాజు అన్నారు. ఉపాధ్యాయుడు కుమ్మరపూడి రవిబాబు, కార్మిక నాయకుడు అవిరెడ్డి అబ్బు తదితరులు పాల్గొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీదేవి పిలుపునిచ్చారు.

కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించండి



ఓట్ల లెక్కింపు విధి విధానాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్వో మాధురి

అనపర్తి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న చేపట్టే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురి కోరారు. మంగళవారం స్థానిక ఆర్ఓ కార్యాలయంలో కౌంటింగ్ ప్రక్రియ, విధి విధానాలపై అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉందని, ఎన్నికల సంఘం ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎక్కడా హింసకు తావివ్వరాదని, అల్లర్లు సృష్టించాలని చూస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అభ్యర్థులు, వారు అనుమతి పొందిన వారి సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లు తెరుస్తామని అన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రుతుస్రావం సహజమైనదిగా భావించాలి



అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: రుతుస్రావం సహజమైనదిగా భావించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం బొమ్మూరులోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో ప్రపంచ మెన్‌స్ట్రువల్ హైజీన్ డే–2024 సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2030కు రుతుస్రావాన్ని సాధారణ జీవిత వాస్తవంగా చేయడమే లక్ష్యమన్నారు. సమతుల ఆహారంతో క్రమం తప్పకుండా రుతుస్రావం వస్తుందని, దీనికి అంతా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ప్రపంచంలో ఎక్కడున్నా తమ రుతుస్రావాన్ని సురక్షితంగా, శుభ్రంగా, గౌరవంగా నిర్వహించుకునే హక్కు ఉందన్నారు. పాఠశాల విద్యలో సమగ్ర రుతుస్రావ విద్యను ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యంపై అవగాహన కల్పించవచ్చన్నారు. వివిధ సంస్థలను భాగస్వామ్యం చేసి అవసరమైన వారికి హైజీన్ ఉత్పత్తులను పంపిణీ చేసేలా చూస్తామన్నారు. జిల్లా ఎపిడిమియాలజిస్ట్ సుధీర్ బాబు, జిల్లా ఎన్‌సీడీ ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్, స్టాటస్టిక్స్ ఆఫీసర్ కుమార్‌స్వామి, సూపర్‌వైజర్లు జాన్సన్‌రాజు, బూరె రాజు, అలీ బేగ్, సత్యనారాయణ, ఆఫీస్ సూపరింటెండెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతం



అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ విధానాన్ని పరిశీలిస్తున్న క్రిస్ప్ బృందం

రాజానగరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న ప్రీ స్కూల్ విధానాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, రాజానగరంతో పాటు రంపచోడవరం మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. దీని ద్వారా ఆయా కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తల సామర్థ్యాలను అభివృద్ధి చేయడం, అమలవుతున్న ప్రీ స్కూల్ విధానంలో లోపాలను గుర్తించి సరిచేయడం కోసం క్రిస్ప్ (సెంట్రల్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్) ఎన్జీఓ బృందం పనిచేస్తుంది. క్రిస్ప్ సలహాదారుగా ఉన్న ఐఏఎస్ అధికారి మురళీ ఆకునూరి ఆధ్వర్యంలో ఈ బృందం రాజమహేంద్రవరంలోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ కె.విజయకుమారిని కలుసుకుని, ఇన్నీసుపేటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించింది. అక్కడి నుంచి రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టుకు చేరుకుని, స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం–2లో అమలవుతున్న ప్రీ స్కూల్ విధానాన్ని పరిశీలించారు. నోడల్ అధికారిగా ఉన్న రాజానగరం ఐసీడీఎస్ సీడీపీఓ కె.నాగలక్ష్మి ఇందుకు సంబంధించిన వివరాలను తెలిపారు. ప్రీ స్కూల్ అమలును మరింత సమర్థవంతంగా అమలు చేయాలనే ఉద్దేశంతో రాజమహేంద్రవరం సిటీ, రాజానగరం, రంపచోడవరం ప్రాజెక్టులను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, వీటి పరిధిలోని 15 అంగన్‌వాడీ కేంద్రాలను తీసుకున్నారన్నారు. ఇందులో భాగంగానే క్రిస్ప్ బృందం ఈ కేంద్రాలను సందర్శించి, ప్రీ స్కూల్ అమలును పరిశీలిస్తుందన్నారు. డిప్యూటీ డైరెక్టర్ ఈఎస్‌వీవీ నారాయణ తదితరులు ఉన్నారు.

నీడనిచ్చె.. సేదతీర్చే



దోసకాయలపల్లి నంది సెంటర్‌లో నీడనిస్తున్న చెట్టు

మధురపూడి: పచ్చని చెట్లు తోడుంటే, ఆ ఆహ్లాదమే వేరు. మండు వేసవిలోనూ చెట్టు నీడన చల్లదనం ఊరటనిస్తోంది. కోరుకొండ మండలం దోసకాయలపల్లి నంది సెంటర్‌లోనూ ఓ చెట్టుకు ప్రాధాన్యం ఉంది. మునిసబు వ్యవస్థ సమయంలో ఏర్పాటైన ఈ సెంటర్‌కు పేరుంది. ఇక్కడ చెట్టు నీడ రచ్చబండకు కేంద్రంగా మారింది. అలాగే కోటికేశవరం గాంధీ సెంటర్‌లో రచ్చబండ, కాపవరం రామాలయం సెంటర్‌లో చెట్టు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఇక్కడ ఊళ్లోవారు కూర్చొని గల్లీ నుంచి ఢిల్లీ వరకూ జరుగుతున్న పరిణామాలపై చర్చించుకోవడం గమనార్హం. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీల గెలుపోటములపై చర్చ సాగిస్తున్నారు. ఏదేమైనా ఈ చెట్ల నీడన ఆహ్లాదంతో పాటు సమాచార కేంద్రాలుగా మారాయి.

భానుడి భగభగలు

- తగ్గని ఎండల తీవ్రత
- పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీల పైనే..
- రాత్రివేళల్లో మరింత ఉక్కబోత



దివాన్‌చెరువు ప్రాంతంలో జాతీయ రహదారిపై చెట్ల నీడకు చేరిన భారీ వాహనాలు



రాజానగరం: ఎండ మండిస్తోంది.. గుబులు రేపుతుంది.. ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.. ఉదయం నుంచి రాత్రయినా ఉక్కబోత ఎక్కడా తగ్గడం లేదు. రోహిణీ కార్తె ప్రవేశించకుండానే మండుతున్న ఎండలతో జనం అల్లాడుతున్నారు. రాజానగరం నియోజకవర్గంలో ప్రస్తుతం పగటి పూట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైబడి నమోదుతున్న నేపథ్యంలో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. మరో రెండు రోజుల్లో రోహిణీ కార్తె ప్రవేశిస్తుంది. అప్పుడు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. అధికంగా ఉన్న పగటి ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప బయటకు రావడానికి సాహసించడం లేదు. ఒకవేళ తెగించి వెళితే వడగాడ్పుల బారిన పడాల్సి వస్తుందని భయపడుతున్నారు.

నీడకు చేరి.. సేదతీరి

వేసవి ఎండల తీవ్రతతో ప్రయాణం చేయడానికి జనం హడలిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో లారీలు వంటి భారీ వాహనచోదకుల పరిస్థితి దారుణంగా ఉంది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4 గంటల వరకూ రాజానగరం నుంచి దివాన్‌చెరువు మీదుగా రాజమహేంద్రవరం వరకూ జాతీయ రహదారిపై చెట్ల నీడ కనిపిస్తే అక్కడ లారీలు, ఇతర వాహనాలు ఆపి, కాస్త సేద తీరుతున్నారు. ఈ వాతావరణంలో ఉక్కబోతను తట్టుకుని తాము వాహనాలను నడిపినా గాని, యంత్రాల వేడి ఎక్కువైతే కష్టమని, చెట్ల నీడన ఆగాల్సి వస్తుందని వారు అంటున్నారు.

మూతపడుతున్న దుకాణాలు

జాతీయ రహదారిపై లాలాచెరువు, దివాన్‌చెరువు, రాజానగరం వంటి ప్రధాన కూడళ్లలోని వ్యాపార, వాణిజ్య దుకాణాలను మధ్యాహ్న సమయంలో మూసివేస్తున్నారు. రాజానగరం, కోరుకొండ, సీతానగరం వంటి మండల కేంద్రాలలో కూడా ఇదే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సాయంత్రం 5 గంటలు దాటితేనేగాని జనం రోడ్లపైకి రావడం లేదు. అందువల్ల దుకాణాలను తెరవడం లేదు. చివరకు వేసవిలో జనం దాహాన్ని తీర్చే జ్యూస్, కూల్ డ్రింక్స్ షాపులు కూడా మూతపడుతున్నాయంటే ఎండ తీవ్రత జనాన్ని ఎంతగా హడలెత్తిస్తుందో అర్థం చేసుకోవచ్చు.

ఆర్ట్స్ గ్రూప్ ఏర్పాటు చేయాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఫోరం జిల్లా శాఖ నాయకులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నూతనంగా ఏర్పాటు చేసే ఇంటర్ తరగతుల్లో ఆర్ట్స్ గ్రూప్ ఏర్పాటు చేయాలని సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం జిల్లా శాఖ మంగళవారం డీఈవో కె.వాసుదేవరావును కలిసి విజ్ఞప్తి చేసింది. నూతనంగా ఏర్పాటు చేసే ఇంటర్మీడియెట్ తరగతుల్లో కేవలం సైన్స్ గ్రూపు ఏర్పాటు చేయడం వల్ల ఆర్ట్స్ గ్రూప్ చదవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు అవకాశం లేకుండా పోతుందన్నారు. దీనివల్ల ప్రతి కాలేజీలోనూ సీఈసీ గ్రూపు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సోషల్ స్టడీస్ ఫోరం జిల్లా ప్రతినిధులు కోలా సత్యనారాయణ, సూరిబాబు, డేనియల్ బాబు, బుడుమూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి

కంబాలచెరువు: ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వై.రామకృష్ణ ప్రసాద్ ఉపాధ్యాయ లోకానికి అందించిన సేవలు మరువలేనివని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక నెహ్రూనగర్ ఉన్నత పాఠశాలలో రామకృష్ణ ప్రసాద్ మూడో వర్ధంతి సభ మంగళవారం జరిగింది. రామకృష్ణ ప్రసాద్ చిత్రపటానికి ఆయన కుమారుడు వై.శ్రీధర్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంఘ అధ్యక్షుడు డేవిడ్ లివింగ్‌స్టన్, గౌరవాధ్యక్షుడు అప్పయ్యశాస్త్రి, రాష్ట్ర కౌన్సిలర్ పింగళి శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ, సీపీఎస్ రామలింగశాస్త్రి, వైపీ రామారావు, తాతారావు, ఎస్జీ శంకర్, ఆర్‌బీ మార్కండేయులు, జీఎస్ఆర్ ఆంజనేయులు, టి.సీతారామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల:	లవ్‌మీ
సూర్యమినీ:	సిల్క్ శారీ,డర్టీ ఫెలో
సూర్యప్యాలెస్:	ప్యూరియోసా
స్వామి:	కృష్ణమ్మ, సిడి
శివజ్యోతి:	లవ్‌మీ
అనుశ్రీ:	ప్యూరియోసా
రాజా:	ప్యూరియోసా
ఊర్వశి:	బాక్
రంభ:	ఆ ఒక్కటీ అడక్కు
మేనక:	ప్రసన్న వదనం
అప్సర:	ప్యూరియోసా
కుమారి:	రాజు యాదవ్
నామవరం:	
విఎస్.మహల్:	లవ్‌మీ
ధవళేశ్వరం:	
మురళీకృష్ణ:	లవ్‌మీ